క్లుప్తంగా

10న మాతా మాణికేశ్వరి జయంతి

నారాయణపేట రూరల్: తెలంగాణ సరిహద్దులో ఉన్న యానగుంది సూర్యనంది క్షేత్రంపై వెలసిన శ్రీ వీరధర్మజ మాణికేశ్వరి మాత 92వ జయంతి వేడుకలు ఈనెల 10న గురువారం ఆషాఢశుద్ధ గురుపూర్ణిమ రోజు నిర్వహిస్తున్నట్లు కార్యదర్శి శివయ్య స్వామి, ట్రస్ట్ సభ్యులు మందార్, బండి శివరాం రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు రుద్రాభిషేకం, అమ్మవారి పాదపూజ సాయంత్రం 7 గంటలకు రథోత్సవ కార్యక్రమాలు జరుగుతాయన్నారు. అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. అదేవిధంగా నారాయణపేట పగిడిమర్రి రోడ్డులో గల అమ్మవారి ఆశ్రమంలో కూడా ప్రత్యేక పూజా కార్యక్రమాలు అమ్మవారి డోలారోహణ కార్యక్రమం అనంతరం మధ్యాహ్నం 12:30కు మహా మంగళహారతి తీర్థ ప్రసాదాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులు పెద్దసంఖ్యలో హాజరుకావాలని కోరారు.

బోనస్ డబ్బులు విడుదల చేయాలి



ధన్వాడ: రైతుల వద్ద కొనుగోలు చేసిన వరి ధాన్యానికి సంబంధించి బోనస్ డబ్బులను వెంటనే రైతుల ఖాతాల్లో జమచేయాలని బీజేపీ జిల్లా సోషల్ మీడియా ఇన్‌చార్జి ఉమేష్ కుమార్ అన్నారు. ఆదివారం ధన్వాడ మండల కేంద్రంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ ప్రభుత్వం వరి కొనుగోలు చేసి నెల గడుస్తున్నా నేటికీ బోనస్ డబ్బులు విడుదల చేయలేదని విమర్శించారు. ప్రస్తుతం రైతన్నలు సాగు పనులు చేపట్టడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని ప్రభుత్వం వెంటనే బోనస్ డబ్బులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాము, కళయ్య తదితరులు పాల్గొన్నారు.

25న లోకపల్లి లక్ష్మమ్మ ఉత్సవాలు

నారాయణపేట రూరల్: జిల్లా కేంద్రం సమీపంలోని లోకాయపల్లి సంస్థానం శ్రీశ్రీ లోకపల్లి లక్ష్మమ్మ శ్రావణ మాస ఉత్సవాలను ఘనంగా నిర్వహిద్దామని కమిటీ సభ్యులు తీర్మానించారు. అమ్మవారి దేవాలయంలో ఆదివారం సమావేశమై వేడుకల నిర్వహణపై చర్చించారు. ఈ సందర్భంగా ఏడాదికి గాను అమ్మవారి టెంకాయల టెండర్లను ఆహ్వానించారు. జూలై 24న అమ్మవారి పల్లకి సేవ, 25న మొదటి శ్రావణ శుక్రవారం అమ్మవారి ఉత్సవాలు ప్రారంభించాలని నిర్ణయించారు. అదే విధంగా ఆగస్టు 22న అమ్మవారి జాతర మహోత్సవం చేపట్టాలని తీర్మానించారు. అమ్మవారు, ఆంజనేయ స్వామి దేవాలయం పరిసరాలను అందంగా తీర్చిదిద్దడం, రోడ్డుకు ఇరు ప్రక్కల కంప చెట్లు తొలగించడం, ఆలయ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేటట్లు, భక్తులకు మంచినీటి సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు చేపట్టారు. సమావేశంలో కమిటీ సభ్యులు కన్నా జగదీష్, వేముల మధుసూదన్ రెడ్డి, లప్ప అశోక్, పిల్లి నరసింహులు, చంద్రశేఖర్ గౌడ్, రమాకాంత్, గొల్ల బుగ్గన, సంతోష్ నామాజీ, ఆలయ పూజారి సోమశేఖర్ స్వామి, మాజీ ఎంపిటిసి రాంరెడ్డి పాల్గొన్నారు.

మిత్రుడికి ఆర్థిక సాయం



కొత్తపల్లి: మండల పరిధిలోని భూనీడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2008–09లో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు తమ తోటి మిత్రుడికి ఆర్థికసాయం అందజేసి ఆదర్శంగా నిలిచారు. శివకుమార్ ఇటీవల అమీన్‌పూర్ నుంచి నారాయణ పేట జిల్లా కేంద్రానికి బైక్‌పై వస్తుండగా ప్రమాదానికి గురయ్యాడు. కాలు, చేయి విరగడంతో ఆస్పత్రిలో చేర్పించారు. విషయం తెలుసుకున్న తోటిమిత్రులు శివకుమార్‌ని పరామర్శించి అతడి తల్లికి రూ.61వేలు అందజేశారు.

కేజీబీవీ విద్యార్థినుల అస్వస్థత

దామరగిద్ద: మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ గురుకుల పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. ఆదివారం పదో తరగతికి చెందిన విద్యార్థిని హరితకు జ్వరం రావడంతో ఉపాధ్యాయులు విద్యార్థిని తల్లిదండ్రులకు సమాచారం అందించారు. వారు తమ కుమార్తెకు ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. అదే విధంగా బాపన్‌పల్లి గ్రామానికి చెందిన మహేశ్వరి కూడా జ్వరంతో బాధపడుతుండగా విద్యార్థి తల్లిదండ్రులు ఆస్పత్రికి తీసుకెళ్లగా డెంగీ సోకినట్లు గుర్తించి వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ఈ విషయమై కేజీబీవీ ఎస్ఓ స్వాతిని వివరణ కోరగా ఇద్దరికి జ్వరం రాగా ఇంటికి పంపించినట్లు తెలిపారు.

పరిశుభ్రతే నివారణ మార్గం

- ప్రతి శుక్రవారం పారిశుద్ధ్యంపై పర్యవేక్షణ
- స్టాప్ డయోరియాపై ప్రజలకు అవగాహన



దామరగిద్దలో దోమల నివారణకు ఫాగింగ్ చేస్తున్న సిబ్బంది

దామరగిద్ద: వర్షాకాలం అంటేనే సీజనల్ వ్యాధులు వ్యాపించే సీజన్. ఎడతెరిపి లేని వర్షాల కారణంగా ఇళ్ల మధ్యలో, రోడ్లపై మురుగు నిలిచి ఈగలు, దోమలు వృద్ధి చెంది వృద్ధులు, పిల్లలు మలేరియా, డెంగీ, చికున్‌గున్యా, ఫైలేరియా వంటి వ్యాధులకు గురయ్యే అవకాశం ఉంటుంది. ఈ క్రమంలో ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ప్రభుత్వం ఆదేశాల మేరకు వైద్యారోగ్య శాఖ అధికారులు, గ్రామ పంచాయతీ సిబ్బంది సమన్వయంతో ముందస్తు చర్యలు చేపట్టారు. ప్రతి శుక్రవారం ఫ్రైడే.. డ్రైడే పేరుతో ప్రతి గ్రామ పంచాయతీలో ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు మురుగునీటి నిల్వలను తొలగించేలా చూడడం అలాగే దోమల నివారణకు టెమిఫోస్, మలాథియాన్ రసాయనాలను ఫాగింగ్ చేస్తున్నారు.

ఎనిమిది సబ్‌సెంటర్‌లలో వైద్యసేవలు

మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఎనిమిది సబ్‌సెంటర్లు ఉన్నాయి. వీటిలో



ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో విద్యార్థిన్ని పరీక్షిస్తున్న వైద్యాధికారి

ఆరుగురు మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్స్ (ఎంఎల్‌హెచ్‌పీ డాక్టర్స్) ప్రజలకు వైద్య సేవలను అందిస్తున్నారు. మండల కేంద్రమైన దామరగిద్ద ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రోజుకు 70 నుంచి 80 మంది ఓపీ పేషెంట్‌లు సీజనల్ వ్యాధులైన జ్వరం, జలుబు, వంటి వ్యాధుల చికిత్స కోసం వస్తుంటారు. వీరితో పాటు ఆయా సబ్ సెంటర్ల పరిధిలోని కాన్‌కుర్తి, మొగుల్‌మడ్కచ విఠలాపూర్, సజనాపూర్, వత్తుగుండ్ల, లోకూర్తి కేంద్రాల్లో ఎంఎల్‌హెచ్‌పీ వైద్యులు సేవలు అందిస్తున్నారు.

ఈ జాగ్రత్తలు తీసుకోవడం మంచిది

సీజనల్ వ్యాధులు కొన్ని సార్లు ప్రమాదకరం కావొచ్చని వైద్యులు సూచిస్తున్నారు. ఈ క్రమంలో మలేరియా, టైఫాయిండ్, డెంగీ వంటి విష జ్వరాల బారిన పడకుండా కింది చర్యలు తీసుకోవాలని సూచిస్తున్నారు.

- ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని. ముఖ్యంగా గుంతలు, పెద్ద పెద్ద కాల్వలు ఉంటే దోమలు గుడ్లు పెట్టకుండా మందు చల్లాలి. ఎప్పుడు నీరు పారేలా చర్యలు తీసుకోవాలి
- ప్రతి ఇంట్లో డ్రైడేను విధిగా పాటించాలి. ఇంటి ఆవరణలో నీటి గుంతలు లేకుండా చూడాలి.
- ఇంటిపై ఉన్న ఓవర్‌హెడ్ ట్యాంకుల పైనా మూతలు కచ్చితంగా పెట్టాలి
- పనికిరాని రబ్బరు టైర్లు, వాటర్ కూలర్స్ వంటి వాటిలో నీరు నిల్వ ఉంటే పారబోయాలి.
- పరిసరాల శుభ్రతతో పాటు వ్యక్తిగత శుభ్రత పాటించాలి. అలాగే కాచీ చల్లార్చిన నీరు తాగాలి. వేడి ఆహారం తీసుకోవడం మంచిది.

ముందస్తు నివారణ చర్యలు



సీజనల్ వ్యాధులు ప్రబల కుండా గ్రామాల్లో పంచాయతీ అధికారుల సమన్వయంతో ముందస్తు చర్యలు చేపడుతున్నాం. అవసరమైన మందులు అందుబాటులో ఉన్నాయి. జూలై 31 వరకు ప్రతి శుక్రవారం ఫ్రైడే.. డ్రైడే పేరుతో వైద్య సిబ్బందితో కలిసి మురుగునీటిపై లార్వాలను గుర్తించి నివారణ చర్యలు చేపడుతున్నాం. అలాగే ప్రజలకు పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత శుభ్రత, ఆహార పరిశుభ్రత పై అవగాహన కల్పిస్తున్నాం.

–సుదేష్ణ, వైద్యాధికారి, దామరగిద్ద

భక్తిశ్రద్ధలతో మొహర్రం పండుగ



మద్దూరులో అలాయ్‌బలాయ్ తీసుకుంటున్న పీర్లు

నారాయణపేట రూరల్: మండలంలోని బైరంకొండ, కోటకొండ, జాజాపూర్, కొల్లంపల్లి గ్రామాల్లో ఆదివారం మొహర్రం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయం గ్రామ పురవీధుల గుండా సవారీ పీర్లను పూలతో అలంకరించి సాహెబ్ ఖాశీం మోసి శోభాయాత్ర చేపట్టి పీర్లచావిడి వద్దకు తీసుకొచ్చారు. పీర్లను చూసేందుకు భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. అనంతరం మలీజా వితరణ చేపట్టి మొక్కలు తీర్చుకున్నారు. కులమతాలకు అతీతంగా అలాయ్ బలాయ్ ఆడుకున్నారు. ఈ సందర్భంగా మహిళలు ఖాసీంసాబ్‌ను కీర్తిస్తూ పాటలు పాడుతూ బొడ్డెమ్మలు వేశారు.

నిమజ్జనానికి తరలిన పీర్లు

మద్దూరు: మండలంలో తొమ్మిది రోజుల పాటు విశేషపూజలందుకున్న పీర్లు ఆదివారం నిమజ్జనానికి తరలివెళ్లాయి. మండలంలోని మద్దూరు,



కాట్రిమ్‌పల్లిలో ఊరేగింపుగా వెళ్తున్న పీర్లు

పల్లెర్ల, దమగ్నపూర్, ఖాజీపూర్, రెనివట్ల తదితర గ్రామాలోని పీర్ల చావడిల దగ్గర ప్రతిష్ఠించిన పీర్లకు కులమాతాలకతీతంగా పూజలు నిర్వహించారు. మండలంలో మంగళవారం ఐదోదుల బాలుడు, బుధవారం అబ్బసలీ, గురువారం ఇమామే ఖాసీం, శుక్రవారం ఇమామ్, శనివారం హసేన్‌హుసేన్ సవారీలు రాత్రివేళల్లో ఘనంగా జరిగాయి. హసేన్ హుసేన్ సవారీ సందర్భంగా కొట్లలోని పీర్ల చావడిలో పెద్దఎత్తున యువకులు అలయ్, మహిళలు బొడ్డెమ్మలు ఆడారు. గ్రామపెద్దలు పీర్లపై బుర్కను చల్లి షాహదత్‌కు పంపించారు. అనంతరం పీరు నిమజ్జనానికి తరలివెళ్లాయి.

మొక్కులు చెల్లించుకున్న భక్తులు

మక్తల్: మండలంలోని వివిధ గ్రామాల్లో మొహర్రం వేడుకలు ముగిశాయి. ఆదివారం పీర్లకు భక్తిశ్రద్ధలతో ఆలయ్ బలాయ్ నిర్వహించారు. మహిళలు బొడ్డెమ్మలు వేసుకుంటూ వెళ్లారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు.

బాబు జగ్జీవన్‌రాం ఆశయాలు కొనసాగిద్దాం



బాబు జగ్జీవన్‌రాం చిత్రపటానికి నివాళులర్పించిన బీజేపీ నాయకులు

నారాయణపేట రూరల్: మాజీ ఉప ప్రధాని బడుగుల ఆశాజ్యోతి బాబు జగ్జీవన్ రాం వర్ధంతిని పురస్కరించుకొని బీజేపీ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. ఆదివారం పట్టణ బీజేపీ అధ్యక్షుడు వినోద్ ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయంలో వర్ధంతి కార్యక్రమం నిర్వహించి ఆయన చిత్రపటానికి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ జగ్జీవన్ రాం బడుగుల అభ్యున్నతి కోసం అహర్నిశలు కృషి చేశారన్నారు. ఆయన ఆశయాలను మనందరం కొనసాగిద్దామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ నందు నామాజీ, జిల్లా బీజేపీ కోశాధికారి వెంకట రాములు, వెంకటయ్య, నగేష్, గోపాల్, రమేష్, సత్యనారాయణ, దత్తు, శ్రీనివాస్ రెడ్డి, పాండు, మొగులప్ప, చేతన్, సైదప్ప, చందు, కిరణ్ డగే, ఉమాకాంత్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నాయకుల ఘన నివాళులు

ఊట్కూరు: మండలంలో డాక్టర్ బాబుజగ్జీవన్‌రాం వర్ధంతిని పురస్కరించుకొని అంబేడ్కర్ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. ముందుగా జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం మాట్లాడుతూ ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు శంకర్, శ్రీనివాస్, దశరథ్, అశోక్, నారాయణ పాల్గొన్నారు.

ఆలయాల్లో ఏకాదశి పూజలు



నారాయణపేటలోని పాండురంగస్వామి ఆలయంలో పూజలు జరిపిస్తున్న భక్తులు



చిత్తనూర్ రామాలయంలో సుదర్శన యాగం చేస్తున్న భక్తులు

నారాయణపేట రూరల్: పట్టణంలోని సరాఫ్‌బజార్ బాలాజీ దేవాలయం, శ్రీరాధారుక్మిణీ సమేత పాండురంగస్వామి ఆలయం, శ్రీ హరే కృష్ణ మందిరంతో పాటు మండలంలోని కోటకొండ గ్రామంలోని విఠోభా ఆలయంలో ఆదివారం తొలి ఏకాదశి వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి పంచామృతాభిషేకం, పుష్పాలంకరణ, మహామంగళహారతి తదితర పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

దంపతుల సుదర్శనయాగం

మరికల్: మండలంలో తొలి ఏకాదశి పూజలను భక్తులు ఆదివారం ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా చిత్తనూర్ ఎర్రగుట్ట రామాలయంలో పలువురు దంపతులు పాల్గొని సుదర్శన యాగం నిర్వహించారు. పూజారి శ్రీకాంత్ యాగంలో పాల్గొన్న దంపతులతో ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం ఏకాదశి విశిష్టతను భక్తులకు వివరించారు. అలాగే హోమం ముగిసిన తర్వాత సీతారామలక్ష్మణ ఆంజనేయ స్వామి విగ్రహాలను పల్లకిసేవాలో భాగంగా పురవీధుల గుండా ఊరేగించారు. యువకులు ఏకాదశి రోజున వేంకటేశ్వర స్వామిని దర్శించుకునేందుకు మరికల్ నుంచి మన్యం కొండకు పాదయాత్రగా తరలివెళ్లారు. కార్యక్రమంలో ఆలయకర్త లక్ష్మీకాంత్‌రెడ్డితో పాటు భక్తులు పాల్గొన్నారు.

'బెదిరింపులకు పాల్పడితే చూస్తూ ఊరుకోం'

కృష్ణా: ముదిరాజులను బెదిరింపులకు పాల్పడితే చూస్తూ ఊరుకోమని ముదిరాజ్ సంఘం జిల్లా నాయకుడు, ఉట్కూర్ మాజీ సర్పంచ్ భాస్కర్ అన్నారు. ఆదివారం మండలంలోని గుడెబల్లూర్ గ్రామానికి చెందిన వెంకటేశ్ కుటుంబాన్ని ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వెంకటేశ్‌కు 1988లో మురహర్‌దొడ్డి గ్రామ శివారులో ప్రభుత్వం 10.12 ఎకరాల భూమిని అందించిందన్నారు. అయితే ఆ భూమి చుట్టూ వందల ఎకరాల భూమి కలిగి ఉన్న ఓ మాజీ పోలీస్ అధికారి.. వెంకటేశ్‌కు చెందిన భూమిని కూడా కబ్జా చేసేందుకు ప్రయత్నించడంతో ఇద్దరి మధ్య వివాదం నెలకొందన్నారు. ఈ క్రమంలోనే వెంకటేశ్‌పై మాజీ పోలీస్ అధికారి అక్రమ కేసు బనాయించి అరెస్టు చేయించాడన్నారు. భయపడితే తాము భయపడమని ముదిరాజులంతా బాధిత కుటుంబానికి అండగా ఉంటామన్నారు. సమావేశంలో ముదిరాజ్ సంఘం నాయకులు పాల్గొన్నారు.

శామాప్రసాద్ ముఖర్జీ జీవితం స్ఫూర్తిదాయకం



శామాప్రసాద్ ముఖర్జీకి నివాళులు అర్పించిన బీజేపీ నాయకులు

నారాయణపేట రూరల్: డాక్టర్ శామాప్రసాద్ ముఖర్జీ జీవితం ప్రతి ఒక్కరికి స్ఫూర్తి దాయకమని బీజేపీ నాయకులు పేర్కొన్నారు. పట్టణ బీజేపీ అధ్యక్షుడు వినోద్ ఆధ్వర్యంలో పట్టణంలోని పార్టీ కార్యాలయంలో శామాప్రసాద్ ముఖర్జీ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతు శామాప్రసాద్ ముఖర్జీ ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆచరించి దేశ ఐక్యతకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో నందు నామాజీ, వెంకట రాములు, వెంకటయ్య, నగేష్, గోపాల్, రమేష్, సత్యనారాయణ, దత్తు, శ్రీనివాస్, కిరణ్ పాల్గొన్నారు.

శామాప్రసాద్ ముఖర్జీ సేవలు మరవలేనివి

మక్తల్: జనసంఘ్ వ్యవస్థాపకుడు శామాప్రసాద్ ముఖర్జీ జయంతిని మండలంలోని అనుగొండలో బీజేపీ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ శామాప్రసాద్ ఆశయ సాధనకు కార్యకర్తలందరూ కృషి చేయాలని జిల్లా ఉపాధ్యక్షుడు సోంశేఖర్‌గౌడ్ కోరారు. కార్యక్రమంలో కల్లూరినాగప్ప, మండల బీజేపీ అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి, చిట్యాల లక్ష్మణ్, శ్రీకాంత్, రాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ అధికారుల నిర్లక్ష్యానికి నిలువుటద్దం



కొత్తపల్లి: మండల కేంద్రంలోని గుండుమాల్ రోడ్డు సమీపంలో ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా మారింది. రోడ్డు విస్తరణలో భాగంగా ట్రాన్స్‌ఫార్మర్ మట్టిలో కూరుకుపోయింది. ఈ క్రమంలో ఇటీవల గ్రామానికి చెందిన కటికె తుల్జారానికి చెందిన ఓ మేక మేత మేసే క్రమంలో విద్యుత్ షాక్‌కు గురై మరణించింది. ట్రాన్స్‌ఫార్మర్‌కు సమాంతరంగా రోడ్డు వేయడంతో మూగజీవాలు విద్యుత్ షాక్‌కు గురైనట్లు తుల్జారం ఆవేదన వ్యక్తం చేశాడు. రాత్రి సమయంలో వాహనదారులు కూడా ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉందని అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ రక్షణ గోడ నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

పరిసరాల శుభ్రత అందరి బాధ్యత

నారాయణపేట రూరల్: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ జిల్లా కన్వీనర్ నరేష్ అన్నారు. స్థానిక బాయ్స్ బీసీ హాస్టల్లో కార్యకర్తలు, విద్యార్థులతో కలిసి స్వచ్ఛభారత్ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏబీవీపీ ఆవిర్భవించి 77 సంవత్సరాలు కావొస్తున్న సందర్భంగా సంఘం ఆధ్వర్యంలో ఈనెల 9 వరకు ప్రత్యేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి సతీష్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వెంకటేష్, హాస్టల్ ఇంచార్జ్ ఓంకార్, ఇంతియాజ్, వంశి, మురళీ, ఆదర్శ్, అనిల్, కార్యకర్తలు విద్యార్థులు పాల్గొన్నారు.

లారీలను అడ్డుకున్న రైతులు



మరికల్: ఇథనాల్ కంపెనీకి చెందిన లారీల వల్ల విద్యుత్ తీగలు తెగిపడి ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతున్నయాని జిన్నారం రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు ఆదివారం పొట్టు లారీలను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా రైతు సంఘం నాయకులు దాస్‌రెడ్డి మాట్లాడుతూ కంపెనీకి చెందిన లారీలు ఓవర్ లోడు వేసుకొని వస్తుండడంతో వ్యవసాయ బోర్లకు సరఫరా అయ్యే విద్యుత్ తీగలు లారీలకు తగిలి తెడిపడుతున్నయన్నారు. తీగలు తెగడంతో నెల రోజుల వ్యవధిలోనే రైతులకు చెందిన ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోవడంతో సొంతంగా మరమ్మతు చేయించుకున్నట్లు పలువురు రైతులు వాపోయారు. వెంటనే అధికారులు స్పందించి ఓవర్ లోడుతో వెళ్తున్న లారీలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

జూనోసిస్ వ్యాధులపై అవగాహన

నారాయణపేట రూరల్: ప్రపంచ పెంపుడు జంతువుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం స్థానిక పశుసంవర్ధక కార్యాలయంలోని ఆస్పత్రిలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా పెంపుడు జంతువులకు టీకాలు వేశారు. అనంతరం జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ ఈశ్వర్ రెడ్డి మాట్లాడుతూ.. జూనోసిస్ డే ప్రత్యేకతను వివరించారు. పెంపుడు జంతువులను జాగ్రత్తగా చూసుకోవాలని, చక్కటి ఆహారం అందించాలన్నారు. అలాగే జంతువుల నుంచి సంక్రమించే వ్యాధులను తెలియచేసి నివారణ చర్యలను వివరించారు.

సీపీఐ జిల్లా కార్యదర్శిగా నర్సింహులు

మక్తల్: నారాయణపేట జిల్లా సీపీఐ ఆర్గనైజింగ్ కార్యదర్శిగా మక్తల్‌కు చెందిన నర్సింహులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం మరికల్ మండలం కేంద్రంలో నిర్వహించిన జిల్లా రెండో మహసభలో కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నర్సింహులును జిల్లా కార్యదర్శిగా ఎన్నుకొని అభినందనలు తెలిపారు.

ఘనంగా ఏకలవ్య జయంతి



ఆస్పత్రి ఆవరణలో అల్పాహారం వితరణ చేస్తున్న నాయకులు

నారాయణపేట రూరల్: ఎరుకల ఆదివాసి జిల్లా సంఘం ఆధ్వర్యంలో ఆరాధ్య గురుదైవం ఏకలవ్య జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని అప్పక్‌పల్లి దగ్గర గల జిల్లా ప్రధాన ఆస్పత్రి వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి పూజలు నిర్వహించారు. అనంతరం రోగులకు, వారి బంధువులకు అల్పాహారం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు ఎంఈఓ బాలకిష్టప్ప, రిటైర్డ్ హెచ్ఎం రాములు, మాజీ ఎంపిటిసి రాజు, రామకృష్ణ, రవికుమార్, కాశప్ప, బాలు, బాలస్వామి, ఎల్లప్ప, రవికుమార్, వెంకటేష్, ఆనంద్, బాలు, అశోక్, భాగ్యమ్మ పాల్గొన్నారు.

ఊట్కూరు: మండలంలోని ఎల్‌బీనగర్‌లో ఆదివారం ఎరుకలి సంఘం ఆధ్వర్యంలో ఏకలవ్య జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏకలవ్యుడి చిత్రపటానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రజలకు మిఠాయి పంచి పెట్టారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సూర్యప్రకాష్‌రెడ్డి, ఎరుకలి సంఘం జిల్లా సెక్రటరీ బండి నరేష్, నాయకులు కృష్ణయ్యగౌడ్, మోహన్‌రెడ్డి, కృష్ణయ్యగౌడ్, నర్సింహగౌడ్, డాక్టర్ రఘు తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు అండగా ఉంటాం

- అంధ విద్యార్థికి సహకారం అందిస్తాం
- రాష్ట్ర క్రీడలశాఖ మంత్రి వాకిటి శ్రీహరి



అంధ విద్యార్థి పవన్‌తో గాండ్ల శివకుమార్

ఆత్మకూర్: రాష్ట్రంలో క్రీడాకారులకు అండగా నిలుస్తామని గ్రామీణప్రాంత క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించే విధంగా ప్రోత్సహిస్తున్నామని రాష్ట్ర క్రీడలశాఖ మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి అన్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని మినిస్టర్ క్వార్టర్స్‌లో అంతర్జాతీయ గోల్‌బాల్ పోటీలకు ఎంపికైన ఆత్మకూర్‌కు చెందిన సమ్మీళిత ఫౌండేషన్ విద్యార్థి పవన్‌కల్యాణ్, భారత జట్టు కోచ్‌గా ఎంపికైన సంస్థ డైరక్టర్ గాండ్ల శివకుమార్‌ను రాష్ట్ర స్పోర్ట్స్ డైరక్టర్ సోనిబాలాదేవితో కలిసి సన్మానించారు. ఈజిప్టు దేశంలో సెప్టెంబర్ మొదటివారంలో జరిగే గోల్‌బాల్ క్రీడల్లో ఆత్మకూర్‌లోని సమ్మీళిత ఫౌండేషన్ అంధ విద్యార్థి పవన్ క్రీడాకారుడిగా, శివకుమార్ కోచ్‌గా ఎంపికవ్వడం అభినందనీయమన్నారు. క్రీడాకారులకు అన్నివిధాలుగా అండగా ఉంటామని ప్రభుత్వం తరపున సహాయసహ కారాలు అందిస్తామని హామీనిచ్చారు. కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకుడు రహెమతుల్లా, కోచ్‌లు ఖాదర్, అరుణ్, కిషోర్, దివాకర్ పాల్గొన్నారు.

'స్థానిక' ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగరాలి



లక్ష్మీకాంత్‌రెడ్డిని సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

అమరచింత: స్థానిక సంస్థల ఎన్నికల్లో గ్రామ పంచాయతీలతో పాటు మున్సిపాలిటీలను కైవసం చేసుకునే విధంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు సంఘటితంగా శ్రమించాల్సిన అవసరం ఉందని బీజేపీ రాష్ట్ర నాయకుడు బంగ్లా లక్ష్మీకాంత్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన మండలస్థాయి సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా లక్ష్మీకాంత్‌రెడ్డికి డాక్టరేట్ వచ్చినందును ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ.. పీఎం నరేంద్రమోదీ అందిస్తున్న సంక్షేమ పథకాలను ఇంటింటికీ వివరించాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఉచిత బియ్యం ఏ మాత్రం లేదని అది కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న బియ్యమేననే విషయాన్ని ప్రతి పల్లెకు చేరేలా వివరించాలన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు మోసపూరిత హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు అందించింది ఏ మాత్రం లేదన్నారు. ప్రధాని ఆవాస్‌యోజన్ ద్వారా ఇస్తున్న ఇండ్లనే ఇక్కడ ఇందిరమ్మ ఇండ్లు అని ఇవ్వడమే కాంగ్రెస్ ప్రభుత్వ పాలనను తెలియ పరుస్తున్నదన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షురాలు మంగలావణ్య, నాయకులు మేర్వరాజు, నారాయణ, అశోక్, భాస్కర్, కృష్ణమూర్తి, హరీష్, మల్లారెడ్డిలతో పాటు పలువురు పాల్గొన్నారు.

బీజేపీ నేత బంగ్ల ఔదార్యం

అభివృద్ధికి రూ.3.33 లక్షల విరాళం

ఆత్మకూర్: అభివృద్ధి కార్యక్రమాలకు సొంత నిధులను సమకూర్చుతూ బీజేపీ రాష్ట్రకార్యవర్గ సభ్యుడు డాక్టర్ బంగ్ల లక్ష్మీకాంత్‌రెడ్డి ఔదార్యాన్ని చాటుకుంటున్నారు. ఆదివారం ఆత్మకూర్‌లోని ఇందిరానగర్ కాలనీలో హైమాస్ట్ లైట్లను ఏర్పాటు చేయాలని కార్యకర్తలు కోరడంతో భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. తనకు రైతుబంధు ద్వారా రూ.3.33 లక్షలు వచ్చాయని ఆ నిధులను అభివృద్ధి కార్యక్రమాలకు వినియోగిస్తామని వెల్లడించారు.